

లీకులతో తప్పని ఇక్కట్లు


పైపులైన్‌లో లీకులతో నిలిచిపోయిన నీరు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీలో మంచినీటి సరఫరా చేసే పైపులైన్లు లీకులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జి.రాగంపేట రోడ్డులోని జగనన్న కాలనీ రోడ్డులో కుళాయి పైపులైన్‌కు రెండు చోట్ల లీకులు ఏర్పడ్డాయి. ఆ నీరు ఇళ్ల స్థలాల్లోకి చేరుతుంది. మురుగు కుంటగా మార డంతో దోమలు పెరిగిపోతున్నాయి. కంటి మీద కునుకు లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయివేటు వాహనాలే గతి

- అరకొరగానే ఆర్‌టిసి సేవలు
- గ్రామీణ ప్రాంత ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సామాన్యులకు అందుబాటులో ఉంటూ తక్కువ ఛార్జీలను వసూలు చేస్తూ మారు మూల గ్రామాలకూ ప్రయాణ సదుపాయాలు కల్పిస్తున్న ఆర్‌టిసి సేవలు అరకొరగానే అందుతున్నాయి. పల్లె వెలుగు అని ప్రత్యేకంగా ఉన్నా చాలా పల్లెలకు వీటి సేవలు అందడం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలు నిత్యం సాధారణ ఖర్చులతో విద్య, వైద్యం తదితర అవసరాలకు పట్టణాలకు వస్తుంటారు. అయితే పూర్తిస్థాయిలో సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో ప్రయివేటు వాహనాల్లో అధిక మొత్తం చెల్లించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఆర్‌టిసి ద్వారా అయితే తక్కువ మొత్తంలో మాత్రమే రవాణా ఖర్చులు అయ్యేవి. ప్రయివేటు వాహనాలు ద్వారా అధిక మొత్తంలో సొమ్ములు వెచ్చించాల్సి వస్తుందని సామాన్య ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 350 రూట్లలో 840 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. వీటిలో 500 వరకు పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. జిల్లా కేంద్రాలైన కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలతో పాటు రాజోలు, రావులపాలెం, ఏలేశ్వరం, గోకవరం, తుని, రామచంద్రపురంలలో ఉన్న 9 డిపోల పరిధిలో ఉన్న ఈ బస్సుల్లో ప్రతిరోజు దాదాపు 1.15 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు 4 లక్షల కిలోమీటర్ల మేర ఆర్‌టిసి బస్సులు ప్రయణిస్తున్నాయి. సామాన్య, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలతోపాటు వేలాది మంది స్కూల్, కళాశాల విద్యార్థులు, వందలాది మంది ఉద్యోగులు ప్రతిరోజూ ఆర్‌టిసిలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు.

కొన్ని రూట్లలో పునరుద్ధరించాం

సింగిల్ రూట్లలో జనం ఎక్కడం లేదు. కొన్ని రూట్లలో పాస్‌ల ఉన్న వారు తప్ప వేరే ఎవరూ ఎక్కడం లేదు. సామర్లకోట - పిఠాపురం, యు. కొత్తపల్లి మండలం శ్రీరాంపురం, ఉప్పాడ సర్వీసులను పునరుద్ధరించాం. కాకినాడ బీచ్ రోడ్డు చిందరవందరగా ఉండడంతో తిప్పలేకపోతున్నాం. త్వరలోనే తిప్పే ఆలోచన ఉంది. అవసరమైన ప్రాంతాలకు ఆర్‌టిసి సేవలను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

-మెడిశెట్టి ఉదయవెంకటమనోహర్, ప్రజా రవాణా అధికారి, కాకినాడ

అదనపు భారం

యు.కొత్తపల్లి మండలం రామనక్క పేట, పిఠాపురం మధ్యలో 5 ఏళ్ల క్రితం ఆర్‌టిసి బస్ సర్వీసులు నడిచేవి. కొండెవరం, ఎండపల్లి, నాగులాపల్లి గ్రామాల మీదుగా రమనక్కపేట వెళ్ళేది.శ్రీరాంపురం, రావివారి పోడు, రామ రాఘవపురం వంటి మారుముల గ్రామాలకు కూడా వెళ్లేవారు. పిఠాపురం నుంచి ఉప్పాడ వరకు 10 ఏళ్ల క్రితం ఒక సర్వీసు నడిచేది. ప్రస్తుతం ఆ సర్వీసు రద్దు అయింది. కాకినాడ నుంచి యు.కొత్తపల్లి వరకూ బీచ్ రోడ్డు మీదుగా 2007 వరకూ బస్సులు నడిచేవి. దీంతో సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు ఉండేవి కావు. ఆయితే సదరు సర్వీసులను నిలిపివేయడంతో ప్రయాణికులకు సమస్యలు తప్పడం లేదు. ప్రయివేటు వాహనాల్లో ప్రయాణిస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ సర్వీసు లేకపోవడంతో వందలు వెచ్చించి ప్రయివేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోందని గ్రామీణ ప్రాంత వాసులు వాపోతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి అనుకూల సమయాల్లో ఉండే బస్సు సర్వీసులు ప్రస్తుతం నిలిపివేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత రూట్లలో ఆదాయం లేదని, రోడ్లు దెబ్బతినడంతో తరుచు బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయని పల్లె వెలుగు సర్వీసులను కుదించేశారు. పల్లెలకు బస్సు సర్వీసులను నడపాలని ఆందోళన చేసినా, అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పని మీద పొరుగూళ్లకు వెళ్లాలంటే గ్రామీణ ప్రాంత ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధిక ఛార్జీలను భరించలేక జేబులు గుల్ల చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజా రవాణా అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు కూడా బస్సు సర్వీసులు నడపాలని, రద్దు చేసిన రూట్లలో బస్సులను తిరిగి నడపాలని గ్రామీణులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

జిల్లాలో పలు గ్రామీణ ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులు రాకపోవడంతో ఆ బస్టాండ్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి. దాదాపు 60 శాతం గ్రామాల్లో బస్సులు ఊరిచివరి నుంచి పట్టణాలకు వెళు తున్నాయి. దీంతో ఊరిచివరి ప్రధాన రహదారికి చేర్చి గతంలో విశ్రాంతి భవనాలను నిర్మించారు. ఇప్పుడవి సైకిల్ స్టాండ్లుగా, జూదాలకు, మందుబాబులకు నిలయాలుగా, రాత్రి సమయంలో ఆసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి.


పట్టభద్ర ఓటర్‌ను కలిసి ఓటు వేయాలని కోరుతున్న పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు

ప్రజాశక్తి - అమలాపురం, కాజులూరు, గొల్లప్రోలు

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిగ్గ వీరరాఘవులు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కోసం చట్టసభల్లో పట్టభద్రుల వాణి వినిపించేలా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు గతంలో కూడా పోరాటం చేశారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సాధనాల వెంకటరావు, బొంతు రమణ, వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు ప్రముఖులను కలిసి రాఘవులు ఓట్లు అభ్యర్థించారు.

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సిగా పోటీలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులుకు మద్దతుగా ఎపి కౌలు రైతుల సంఘం ప్రచారాన్ని నిర్వహించింది. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు చెందిన పట్టభద్రులను సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు కలిసి మండలిలో ప్రజల పక్షాన నిలబడి పోరాడే అభ్యర్థి డివి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, స్కీము వర్కర్లు, నిరుద్యోగుల సమస్యలు పిడిఎఫ్ ఎంఎల్ సిలు మాత్రమే మండలిలో పోరాటాలు సాగిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు బుడితి ప్రభాకర్ రావు, నామా చంద్రరావు, మహాలక్ష్మిరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే గొల్లప్రోలు పట్టణంలోనూ, మండలంలోని చేబ్రోలు, మల్లవరం, దుర్గాడ, కొడవలి, వనపూడి, తాడిపత్తి గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులు పట్టభద్రుల ఓటర్లను కలుసుకుని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి. రాఘవులు విజయానికి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను అందజేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులుకు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, సిఐటియు నాయకులు ఏలేటి నానిబాబు, నందీశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో ప్రజాసంఘాల నాయకుల ప్రచారం


కాజులూరు మండలంలో ప్రజాసంఘాల ప్రచారం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం

సాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డు తాళ్లూరు వారి సత్రంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సాయి సేవాసమితి సభ్యుడు అద్దేపల్లి రమేష్ మాట్లాడుతూ కాకినాడ, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ వారి అనుసంధానంతో 11 వ రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 175 మంది యువత రక్తదానం చేశారన్నారు. తమ సంస్థ వివిధ సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు కూడా నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ తాళ్లూరు శేఖర్, డాక్టర్ గీతా శేఖర్ పాల్గొన్నారు. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా దేవత రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాతలకు 10 రకాల ఆహార పదార్ధాలను అందజేశారు.



రక్తదానం చస్తున్న యువకులు

వైస్ ఛైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా

ఛైర్మన్ ఇంటి వద్ద ఉద్రిక్తత - టిడిపి, వైసిపి నేతల మధ్య తోపులాట

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో వైస్ ఛైర్మన్ ఎన్నికకు జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు టిడిపి మద్దతుదారులైన 10 మంది కౌన్సిలర్లు కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. అయితే వైసిపి కౌన్సిలర్లు కౌన్సిల్‌కు హాజరుకాలేదు. కేవలం 10 మంది కౌన్సిలర్లు మాత్రమే రావడంతో ఎన్నికను మరో గంటపాటు వాయిదా వేశారు. అయినా 12 గంటలకు కూడా వైసిపికి చెందిన కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేక వైస్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మంగళవారం తిరిగి వైస్ ఛైర్మన్ ఎన్నికను నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా మీడియాకు తెలిపారు.


కౌన్సిల్ హాల్లో టిడిపి మద్దతుదారులు

తుని మున్సిపల్ ఛైర్మన్ ఇంటి వద్ద టిడిపి, వైసిపి మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఛైర్మన్ ఇంటి నుంచి కౌన్సిల్‌కు వెళ్లేలా మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా నిర్ణయించారు. దీంతో వైసిపికి చెందిన కౌన్సిలర్లు అంతా తొలుత ఛైర్మన్ ఏలూరి సుధారాణి ఇంటికి చేరుకున్నారు. అక్కడ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పట్టణంలో సెక్షన్ 30 అమలులో ఉండటంతో పోలీసులు వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే టిడిపి నాయకులు, కార్యకర్తలకు మాత్రం సెక్షన్ 30 అడ్డుకాలేదు. పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వైసిపి కౌన్సిలర్లు ఛైర్మన్ ఇంటి వద్ద ఉన్నట్లు తెలియడంతో వారంతా ఛైర్మన్ ఇంటిని చుట్టిముట్టారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మున్సిపల్ ఛైర్మన్ ఇంటికి చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు మంత్రి దాడిశెట్టి రాజాతో వాదనకు దిగారు. దీంతో ఇరువైపులా అరుపులు, కేకలతో చిన్నపాటి తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి చేయిదాటిపోకుండా డిఎస్‌పి శ్రీహరిరాజు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఛైర్మన్ ఇంటి లోపల నుంచి కౌన్సిలర్లు బయటకు రాకపోవడంతోపాటు, వైస్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేయడంతో అంతా ఊపరి పీల్చుకున్నారు.



బారికేడ్లతో కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల ధర్నా

అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు జిల్లాలోని పలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. గతంలో సుదీర్ఘ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం చేసిన ఒప్పందం ప్రకారం జిఒలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.రమణమ్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారంలో చొరవ చూపించాలని, తక్షణమే గ్రాడ్యుటి అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న మినీ సెంటర్లలను మెయిన్ సెంటర్లుగా చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలని, యాప్‌లన్ని ఒకే యాప్ గా తీసుకురావాలని కోరారు. సమస్యల పరిష్కారం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు నీరజ, జ్యోతి, రాజేశ్వరి రమ, విజయ, మున్ని, సరోజ, ఏ కనకదుర్గ, డి.మేరీరత్నం, జి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.పద్మ, సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల సమ్మె నిర్వహించడం జరిగిందన్నారు. ఆ సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయశాంత, వెంకటలక్ష్మి, ప్రజావాణి, భవాని, పి.బేబీ, నాగగనిక, సూర్యకాంతం, సత్యవతి, సిఐటియు నాయకులు విశ్వనాథం, వీరబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నీలపాల సూరిబాబు, గరగపాటి పెంటయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దాడి బేబీ, ఎస్తేరురాణి, పి నాగమణి, అమల, టిఎల్.పద్మావతి, సిహెచ్.స్నేహలత, వన కుమారి, దుర్గ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వీరవేణి, వి.వీరమణి మాట్లాడారు. మెనూ ఛార్జీలను పెంపుదల చేయాలని, గత ప్రభుత్వ పాలనలో రాసుకున్న మినిట్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ నాయకులు అబ్బురత్నం, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, వ్యాపారమ్మ, నాగజ్యోతి, భవాని, తనిజ, అన్నపూర్ణ, చామంతి, బేబీ, రోజా తదితరులు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామలింగేశ్వరరావు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శు కాకరపల్లి సునీత, అల్లాడి లక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాజుబాబు, కె.హేమవత, టి.నాగసత్యవతి, ఎన్.అమలావతి, కె.మరియా, ఎంవి.పద్మావతి, పి.జ్యోతి, పి.భవానీ, ఎం. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **తాళ్ళరేవు** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.చంద్రావతి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లు గా మారుస్తూ జి . ఓ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజరాబు, వడ్డి ఏడుకొండలు, విప్పర్తి శ్రీనివాస్, ప్రభారరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగమణి, పి.ఆదిలక్ష్మి, ఉషారాణి, పార్వతి, శ్రీదేవి, కృష్ణవేణి, పద్మజ, సునీత, అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పిఠాపురంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


తాళ్లరేవులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పెద్దాపురంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్టూ'నిజం'



జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ

జర్నలిస్టులపై దాడులను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ కోరారు. పార్వతిపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై టిడిపి నేత దాడి నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు ఆదివారం దాడి చేయడమే కాకుండా నిన్ను చంపడం ఖాయం అంటూ బెదిరించడం దారుణమన్నారు. ఈ దాడిని ఎపిడబ్ల్యూజెఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మక్కువ మండలం ఎ.వెంకంపేట నుంచి కాశీపట్నం వెళ్లే నూతన రహదారి వద్ద వేణుగోపాల్ నాయుడిని కలవడానికి వెళ్లిన విలేకరి రామారావుపై టిడిపి నేత బూతులు తిట్టడమే కాకుండా దాడి చేశారని ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. ఇటీవల 'ప్రజాశక్తి' పత్రికలో ఎన్నికల కోడ్ అధికారులకు పట్టదా..? అనే శీర్షికన మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలతో ఉన్న ఫోటోతో వార్త వెలువడగా కక్ష్య పెట్టుకున్న వేణుగోపాల్ నాయుడు ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. వెంటనే కేసు నమోదు చేసి వేణుగోపాల్ నాయుడుని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జి.శోభన్‌బాబు, వాసంశెట్టి శ్రీనివాస్, కె.సత్యనారాయణ, మంగా వెంకట శివరామకృష్ణ, రాంజీ, ప్రజాశక్తి సిబ్బంది డి.శ్రీనివాస్, సురేష్, మంజన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు


క్రీడాకారుడిని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

కిక్ బాక్సింగ్ విజేతకు ఎంఎల్‌ఎ అభినందన

ప్రజాశక్తి - కరప

న్యూఢిల్లీలో ఫోర్త్ వ్యాకో ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మెడల్స్ సాధించిన సురేష్‌కుమార్‌ను ఎంఎల్‌ఎ పంతం నానాజీ అభినందించారు. మండలంలోని అరట్లకట్ట గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థి సురేష్‌కుమార్ రెండు బ్రాంచ్ మెడల్స్, క్రియేటివ్ పోలో లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ నేపథ్యంలో సురేష్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా ఎంఎల్‌ఎను కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించటం దేశానికి గర్వకారణమని అన్నారు. పిల్లలకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని శారీరక మానసిక ఒత్తిడిని జయించాలంటే క్రీడలు ఎంతో అవసరం అవుతాయని అన్నారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పిఇటిలు యండమూరి అంజనీకుమార్, సిహెచ్.వినయ్‌కుమార్‌ను ఎంఎల్‌ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో వెలుగుబంట్ల శ్రీనివాస్, బత్తుల సతీష్‌కుమార్, వెలుగుబంట్ల రామకృష్ణ, వెలుగు బంట్ల పవన్ పాల్గొన్నారు.

ఉడికించిన కోడి మాంసం, గుడ్లు తినొచ్చు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఎటువంటి భయం లేకుండా ఉడికించిన కోడి మాంసం, గుడ్లు తినవచ్చునని జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి సూర్యప్రకాశరావు అన్నారు. సోమవారం మండలంలోని చెందుర్తి గ్రామ పరిధిలో ఉన్న కోళ్ల ఫారంను సందర్శించారు. బర్డ్ ఫ్లూ వ్యాధి ఇతర కోళ్లకు వ్యాపించకుండా తీసుకోవలసిన బయో సెక్యూరిటీ చర్యలను ఆయన వివరించారు. చనిపోయిన కోళ్లను ప్రజలకు దూరంగా గొయ్యి తీసి కప్పెట్టాలని అన్నారు చనిపోయిన కోళ్లను వ్యాధి నిర్ధారణ కొరకు శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కోళ్ల ఫారాలు వద్ద ప్రజా, వాహన సంచారాన్ని నియంత్రించి వ్యాధి వ్యాప్తిని అరికట్టే బయో సెక్యూరిటీ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో పశుసంవర్ధక శాఖ డిడి అంబేద్కర్, ఎడిఎం శ్రీనివాసరావు, చేబ్రోలు వెటర్నరీ సర్జన్ హిమజ పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 98 ఆటోలు సీజ్

ప్రజాశక్తి - కాకినాడ

నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 98 ఆటోలు సీజ్ చేశారు.కాకినాడ ట్రాఫిక్ 1, 2 పోలీసులు నగరంలో ఓవర్ లోడ్ ప్యాసింజర్, ఓవర్ లోడ్ స్కూల్ చిల్డ్రన్స్ ఆటోలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని ఆటోలపై, ఓవర్ స్పీడ్, నెగ్లిజెన్సీ డ్రైవింగ్ ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆ స్పెషల్ డ్రైవ్ ఉదయం 7 గంటల నుంచి నిర్వహించి 98 ఆటోలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌పి బిందుమాధవ్ మాట్లాడుతూ ప్రధాన రహదారులపై ఆటోలను నిర్లక్ష్యంగా నడిపితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆటోల్లో పరిధికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ సిఐ ఎం.రమేష్, 2వ పట్టణ ట్రాఫిక్ సిఐ డి.రామారావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



టిడిపి నాయకులు, దాడిశెట్టి రాజా మధ్య వాగ్వాదం

దాడిశెట్టి రాజాపై కేసు నమోదు

ప్రజాశక్తి - తుని

మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజాపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా దాడిశెట్టి రాజా తనపై దాడి చేశారంటూ టిడిపి నాయకుడు పోలిశెట్టి రామాలింగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపైనా, కౌన్సిలర్లను ఓట్లు వేయడానికి రానివ్వకుండా ఇంట్లో బంధించి అడ్డంగా అడ్డగించడంపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. వీరపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.త

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గడ్డి మందు తాగిన వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల సామేలు(30) మద్యానికి బానిసయ్యాడు. పని ఏమీ చేయకుండా తిరుగుతుండేవాడు. ఈ నెల 16వ తేదీన సెల్‌ఫోన్ కొనడానికి తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో అతడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతనిని రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు తెలిపారు మృతిని తమ్ముడు సోమరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి భార్యకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కడియం, ఆలమూరు

రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో భర్త మృతి చెందాడు. భార్య తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన ఆదివారం రాత్రి మడికి వద్ద చోటు చేసుకుంది.. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన గంటి రాజు, తన భార్య కుమారితో కలసి ఆదివారం రాత్రి కొత్తపేట మండలం మందపల్లిలో ఓ వివాహ వేడుకకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దుళ్లకు చేరువలో మడికి కాలువ గట్టుపై ముగ్గురు యువకులు బైకుపై ఎదురుగా వచ్చి వీరిని ఢీకొన్నారు. దీంతో రాజు, కుమారిలతో పాటు, ఆ ముగ్గురు యువకుల్లో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.. వీరిని స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో రాజు(33) మృతి చెందాడు. కుమారి రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి కోమాలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజు కేశవరంలోని ఓ ప్రైవేట్ కూల్ డ్రింక్ కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. రాజు, కుమారి దంపతులకు రెండేళ్ల చిన్నారని ఉంది. రాజు మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

1.7 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కోరుకొండ

జంబూపట్నం శివారు అయ్యన్నగళ్ల వద్ద గంజాయిని తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 1.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని నార్త్ జోన్ డిస్‌పి వై.శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడింఆచరు. అయ్యన్నగళ్ల సమీపంలోని రోమ్ సిటీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని సోదా చేయడంతో 1.7 కేజీల గంజాయి దొరికిందన్నారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరంతా రాజానగరం, కోరుకొండ మండాలాలకు చెందిన వారన్నారు. వీరి నుంచి ఒక బైకును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వై సత్యకిషోర్, ఎస్ఐ టి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

ఒకే కుటుంబానికి చెందిన తోటి కోడళ్ల రోడ్డు ప్రమాదంలో మతి చెందారు. మండలంలో పాలచర్ల గ్రామంలో నర్సరీలో పని ముగించుకుని కానవరం ఇంటికి మోటారు సైకిల్ పై కప్పల నాగేశ్వరావు, అతని భార్య రివచ్చా((40), వదిన చంద్రమ్మ(45) వెలుతున్నారు. దివాన్ చెరువు జాతీయ రహదారి పండ్ల మార్కెట్ సమీపానికి చేరుకునే సరికి రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపుకు వెళ్తున్న లారీ వీరిబైకును ఢీకింది. ఈ ప్రమాదంలో రివచ్చా, చంద్రమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. నాగేశ్వరావుకు తల, కాలికి గాయం తగలడంతో 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కిడ్నాప్, అత్యాచారంపై దర్యాప్తు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఒక బాలికను వివాహితుడు కిడ్నప్ చేసి, అత్యాచారం చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అనాతవరం పంచాయతీ పరిధికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ సోమవారం కిడ్నాప్ చేసి, అమలాపురం ఎర్రవంతెన సమీపంలోని ఒక ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అరాచకాన్ని అడ్డుకునేందుకు తరలిరావాలి

ప్రజాశక్తి - తుని

కూటమి ప్రభుత్వ అరాచకాన్ని అడ్డుకునేందుకు మంగళవారం వైసిపి శ్రేణులంతా తుని పట్టణానికి పెద్దఎత్తున తరలిరావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తుని మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డుల్లోనూ వైసిపికి చెందిన వారే కౌన్సిలర్లుగా ఉన్నారని అన్నారు. ఈనెల 3వ తేదీన మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించే సమయానికి 29 మంది కౌన్సిలర్లు ఉన్నారని, వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కౌన్సిల్‌కు వెళ్లగా టిడిపి కార్యకర్తలు, రౌడీలు ఛైర్మన్‌తో పాటు, కౌన్సిలర్లపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. దీంతో అధికారులు 4వ తేదీకి ఎన్నికను వాయిదా వేశారని తెలిపారు. ఆ రోజు అదేరీతిలో టిడిపి నాయకులు వ్యవహరించారని, దీంతో తమకు రక్షణ కల్పించాలని ఛైర్మన్ ఏలూరు సుధారాణి, కౌన్సిలర్లు కోర్టును ఆశ్రయించారని, దీంతో కోర్టు ఉత్తర్వులు మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో ఎన్నికకు ఏర్పాట్లు చేశారని అన్నారు. సోమవారం జరిగే వైస్ ఛైర్మన్ ఎన్నిక కోసం వస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు టిడిపి నాయకులు, కార్యకర్తలను ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. మున్సిపల్ ఛైర్మన్ సుధారాణి ఇంటిపై దాడి చేసి, సిసి కెమెరాలను ధ్వంసం చేశారని అన్నారు. ఇంటిలో ఉన్న ఛైర్మన్ భర్త, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఏలూరు సుధాబాలును తుని రూరల్ సిఐ జి.చెన్న కేశవ రావు బలవంతంగా లాక్కొచ్చి అరెస్టు చేశారని అన్నారు. వైసిపి కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించగా వారితో పెనుగులాడి ఇంటికి తాళం వేయడం జరిగిందని అన్నారు.

ఓటమి భయంతోనే ఎన్నికలకు రావడం లేదు

ప్రజాశక్తి - తుని

ఓటమి భయంతోనే మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా వైసిసి కౌన్సిలర్లను ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారని టిడిపి సీనియర్ నాయకులు చింతమనేడు అబ్బాయి ఆరోపించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైస్ ఛైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు పాల్గొనకుండా మున్సిపల్ ఛైర్మన్ ఏలూరి సుధారాణి ఇంటిలో దాచిపెట్టి తిరిగి కూటమి ప్రభుత్వంపైనా, పోలీసులపైనా బురద జల్లుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి దాచిపెట్టిన కౌన్సలర్ల కోసం వారి బంధువులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మా వాళ్లకు రక్షణ కల్పించాలని కోరుతున్నారని, 200 మంది పోలీసుల బందోబస్తు మధ్య స్వేచ్ఛ వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తుంటే కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. జగన్ పాలనలో మంత్రిగా ఉండి మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి వారిని నామినేషన్ కూడా వేయకుండా అడ్డుకుని, అక్రమ కేసులు పెట్టించిన సంగతిని మాజీ మంత్రి మరిచిపోయినా తుని పట్టణ ప్రజలు మరచిపోలేదని అన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇనిగంటి సత్యనారాయణ గుండెల మీద చెయ్యేసి కాలర్ పట్టుకుని పక్కకు నెట్టేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తునిలో అల్లర్లు సృష్టించేందుకే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా చలో తుని పిలుపునిచ్చారని, అరాచకాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాజేష్, లోవ రాజు, వెంకటేష్, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాం వార్తలు



మంత్రితో భేటీ అయిన ఎంఎల్ఎ అశోక్, మల్లాడి కృష్ణారావు

యానాం చేరుకున్న మంత్రి సాయి శర్వాణన్

ప్రజాశక్తి - యానాం

యానాం పర్యటనలో భాగంగా పుదుచ్చేరి ఆది ద్రావిడ సంక్షేమ శాఖామంత్రి కె.సాయి శర్వాణన్ సోమవారం రాత్రి యానాం చేరుకున్నారు. స్థానిక అతిథి గృహం వద్ద మంత్రికి స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, తదితరులు స్వాగతం పలికారు. మంగళవారం పలు అంశాలపై అధికారులతో మంత్రి చర్చించనున్నారు.

తొలగించిన విఓఎలను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాజకీయ కారణాలతో తొలగించిన యానిమేటర్లను తిరిగి విధులలోకి తీసుకోవాలని హైకోర్టు తీర్పును అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, విఓఎఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగాభవాని డిఆర్‌డిఎ పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాజులూరు, తొండంగి, తుని, కోటనందూరు మండలాల్లో రాజకీయ వేధింపులకు పాల్పడుతూ అప్పటివరకు పని చేస్తున్న విఓఎలను తొలగించి తమ కార్యకర్తలను నియమించుకుంటున్నారని విమర్శించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిడిలు లేకుండా స్వతంత్రంగా పనిచేసే వాతావరణాన్ని డిఆర్‌డిఎ అధికారులు కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసిందన్నారు. తక్షణం రాజకీయ కారణాలతో తొలగించిన విఓఎలను విధులులోకి తీసుకోకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటలక్ష్మి, డి.నాగమణి, కె.గంగాభవని, ఎం.దుర్గా, కె.సంధ్య, టి.నాగవరహాలు, ఎ.లక్ష్మీపార్వతి, ఎం.సరోజిని, జి.శ్యామల, ఎస్.ధనలక్ష్మి, వై.దుర్గాదేవి పాల్గొన్నారు



డిఆర్‌డిఎ పీడీకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

డెక్కన్ కంపెనీ ఆధ్వర్యాన రక్త శిబిరం

ప్రజాశక్తి - తుని

తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కొరకు సోమవారం డెక్కన్ కంపెనీలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్, హెచ్‌ఆర్ పివిఎస్-ఎస్.రాజు ఆధ్వర్యంలో మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహణలో మదర్ బ్లడ్ బ్యాంక్, వైఎస్‌ఆర్ బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఈ శిబిరాన్ని నిర్వహించారు. కంపెనీ ఉద్యోగస్తులు సుమారు 230 మంది రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పివిఎస్ఎస్.రాజు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు అవసరం దృష్ట్యా గత రెండేళ్లుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తలసేమియా పిల్లలకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు.



రక్తదానం చేస్తున్న కంపెనీ ఉద్యోగులు

18 నుంచి జ్ఞాన జ్యోతి శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట, శంఖవరం, పెద్దాపురం

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 18 నుంచి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఎంఇఒ వై.రామకృష్ణయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 165 అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రాథమిక అభ్యాసాన్ని మెరుగుపరిచేలా 'జ్ఞాన జ్యోతి' కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి విడత ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు, రెండో విడత 22 నుంచి 25 వరకూ జరుగుతాయన్నారు. బచ్చు ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలోను, ఉండూరు ఉన్నత పాఠశాలలోనూ ఈ శిక్షణ ఉంటుందన్నారు.అలాగే శంఖవరం మండలంలోఅంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఇఒ రమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులు కత్తిపూడి హైస్కూల్లో ఆరు రోజుల పాటు టిడిఆర్ పద్మావతి ఆధ్వర్యంలో మొదటి విడత తరగతులు ఈనెల 18 నుంచి 20 వరకూ, 2వ విడత 22 నుంచి 25 వరకూ నిర్వహిస్తారని తెలిపారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలోని 123 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ కు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 3 రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ జి ఉష తెలిపారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద అన్న క్యాంటీన్‌లో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగ్గంపేటకి చెందిన మారిశెట్టి జగ్గారావు, మౌళిక దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జగ్గంపేట టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంకి రాంబాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మారిశెట్టి రాధా, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మర్లావ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఉపాధి హామీ పథకం ఎపిడి ఎం.భానుప్రకాష్ పరిశీలించారు. పంట కాలువల పూడిక తీత పనుల్లో 83 మంది ఉపాధి కూలీలు పని చేస్తున్నారు.ఉపాధి కూలీల మస్తర్లను పరిశీలించారు.ఉపాధి పనుల కల్పన, లభిస్తున్న వేతనాలు వంటి అంశాలపై ఆరా తీశారు. ఎక్కువమంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ డి.సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్ బాపూజీ, ఫీల్డ్ అసిస్టెంట్ జి.వేణి తదితరులు పాల్గొన్నారు.

రూపుదిద్దుకోనున్న నూతన గడియార స్తంభం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే స్టేషన్ రింగ్ సెంటర్‌లో విమల్ డ్రింక్స్ కంపెనీ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పాయింట్‌ను ఆధుకరణలో భాగంగా సోమవారం నేలమట్టం చేశారు. గత టిడిపి ప్రభుత్వ పాలనలో రింగ్ సెంటర్లో ట్రాఫిక్ పాయింట్ స్థానే గడియారం స్తంభం ఏర్పాటు పనులు చేపట్టారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఆగిపోయాయి. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చొరవతో గడియారం స్తంభం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

సురక్షితమైన తాగునీరు అందించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కాపవరం రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు ఆదేశించారు. సోమవారం మండలంలోని కాపవరం గ్రామంలోని సమగ్ర రక్షిత మంచినీరు సరఫరా పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పథకం పని తీరు, నీటి శుద్ధీకరణ ప్లాంట్, చెరువును పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.రోడ్డు నిర్మాణం, ప్లాంట్ మరమ్మతుల కోసం రూ. 65 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపించామని, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుభాషిణి తెలిపారు.

దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురంలో సోమవారం ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూతరేకుల తయారీ షాపులు, డ్రై ఫ్రూట్స్ షాపులు, హోటల్స్, స్వీట్ షాప్‌లపై దాడులు నిర్వహించారు. షణ్ముఖ డ్రైఫ్రూట్స్ షాపులో కంపెనీ బ్రాండ్స్ లేకుండా ప్లాస్టిక్ కవర్లో ఉన్న 160 కేజీల కల్తీ నెయ్యిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పూతరేకులు షాపులో పూత చుట్టాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఫీల్డ్ కవర్‌లో భద్రపరిచి హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీకాంత్ చౌదరి, ప్రసాద్, సుబ్బారావు, రొక్కయ్య పాల్గొన్నారు.

పండ్ల నిల్వ చేసే గది దగ్ధం

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో దివాన్ చెరువు జాతీయ రహదారి పక్కన పండ్ల మార్కెట్లో పండ్ల నిల్వ చేసే గది సోమవారం దగ్ధం జరిగింది. దీనిపై జిల్లా అగ్ని మాపకదళాధికారి సిహెచ్ మార్టిన్ లూథర్‌కింగ్ తెలిపిన వివరాల మేరకు ఒక రేకుల షెడ్‌లో చుట్టూ గడ్డి వేసి పైన తాళ్లు, హ్యాగిలర్లతో ఇతర రాష్ట్రాల్లో పండుతున్న యాపిల్, ఆరెంజ్, డ్రాకాన్ తదితర పండ్లును నిల్వ ఉంచు గదిలో ప్రమాద వశాత్తూ అగ్ని ప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ ట్రేలు, గది చుట్టూ గడ్డి ఉండడంతో మంటల చెలరేగాయి. ఇవి మైత్తం కాలి బూడిదైపోయాయి. భారీగా మంటలు, పొగ రావడంతో చుట్టు పక్కల ప్రజలు భయంతో పరుగులు తీశారు. ప్రతి రోజూ పండ్లు అమ్మకుని సాయంత్రం వీటిని గదిలో నిల్వ ఉంచుతామనిబాధితులు ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదం వలన సుమారు రూ.50 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. అగ్ని ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని పూర్తి నివేదికలు జరిగిన వచ్చిన తర్వాత నష్టం, ప్రమాదం కారణాలు తెలుస్తాయని అగ్ని మాపకాధికారి తెలిపారు.

కూటమి ప్రభుత్వ దుర్మార్గాలను అడ్డుకుంటాం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తునిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రభుత్వ దుర్మార్గాన్ని అడ్డుకుంటామని వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. సోమవారం ఆయన ప్రత్తిపాడులో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై జరిగిన దాడి దారుణమన్నారు. టిడిపికి కౌన్సిలర్లు లేకపోయినా వైస్ ఛైర్మన్ పదవి కోసం కూటమి ప్రభుత్వం బరితెగించి దాడులకు పాల్పడుతుందన్నారు. చలో తుని కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంకు శ్రీను, బెహరా దొరబాబు, రామిశెట్టి నాని, గుడాల వెంకటరత్నం, బదిరెడ్డి గోవింద్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ బ్రెయిన్ ఆపరేషన్‌కు సంబంధించి మంజూరు అయిన సిఎం రిలీఫ్ ఫండ్ రూ.5,05,477 చెక్కును శ్రీనివాస్ భార్య పద్మకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, ఐ టిడిపి అధ్యక్షులు రేలంగి వెంకటరావు, మొయిళ్ళ వెంకటేశ్వరరావు, నూనె రామారావుపాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాజులూరు

చోరీలపై యువత అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని కోలంకలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో చోరీలు అధికం అయ్యాయని అన్నారు. వీటిని నివారించడానికి పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నప్పటికీ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయని అన్నారు. వీటిని నివారించడానికి యువత అప్రమత్తంగా ఉండి రాత్రిపూట బృందంగా ఏర్పడి గస్తీ తిరిగితే ఫలితం ఉంటుందన్నారు. ముఖ్యమైన కూడళ్ళలో సిసి కెమెరాలు ఏర్పాటుకు స్థానికుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించాఉరు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది నాగేశ్వరరావు, శేఖర్‌మూర్తి, స్థానికులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌టిఆర్ నగర్‌లో పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. చెట్లను పరిరక్షించటం, మొక్కలు నాటడం ఆవశ్యకతను, బాలలకు హ్యాండ్ వాష్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వీధి నాటికలు, పాటలు ఆలపించారు. ప్రజలకు బ్లీచింగ్ పౌడర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, ఎన్‌సిసి ఆఫీసర్ సనపల సత్యనారాయణ, అధ్యాపకులు బి.శర్వాణి, అనురాధ, కెవిఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య ఫార్మసీ కాలేజీలో 'క్లినికల్ రీసెర్చ్, ఫార్మాకోవిజిలెన్స్- మ్యాటీరియో విజిలెన్స్' అనే అంశంపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో క్లినెట్రా సొల్యూషన్స్(ఎల్ఎల్‌పి) సిఇఒ డాక్టర్ రాజశేఖర్ దంతా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ, రోగుల భద్రతపై వివరించారు. క్లినెట్రా సొల్యూషన్స్ బ్రాంచ్ మేనేజర్ రవి తేజ ఫార్మాకోవిజిలెన్స్ డేటాబేస్ సాఫ్ట్‌వేర్ టూల్‌ను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. సదస్సులో ఆదిత్య ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్ మాట్లాడారు.

ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆదిత్య ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్ఐ వి.మౌనిక ప్రారంభించి మాట్లాడారు. హెల్మెట్ లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంఇ మృతి చెందుతున్నారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వాహన చట్టాలు, వాహన ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రత లేక ఓట్లు వేయడానికి వెళ్లలేదు

ప్రజాశక్తి - తుని

తగిన భద్రత లేకపోవడం వల్ల ఓట్లు వేయడానికి వెళ్లలేదని తుని మున్సిపల్ ఛైర్మన్ ఏలూరు సుధారాణి అన్నారు. సోమవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసులు మా ఇంటికి ఉన్న సిసి కెమెరాలు అన్ని తొలగించి ఇంటి గేట్లను పగలగొట్టి తన భర్త, కో ఆప్షన్ సభ్యులు ఏలూరు బాలును అన్యాయంగా పోలీసులు లాక్కుని వెళ్లి అరెస్ట్ పోలీస్ స్టేషన్లో బంధించారని అన్నారు. తునిలో 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పి టిడిపి అనుచరులు రౌడీలతో మా ఇంటి పై దాడి చేయించి భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. కలెక్టర్, ఎస్‌పి సమక్షంలో భద్రత కల్పించి ఓటు హక్కు వినియోగించుకోవడానికి సహకరించాలని కోరారు.

'చలో తుని'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

మంగళవారం నిర్వహించే చలో తుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బూత్ కమిటీల అధ్యక్షులు ఒమ్మి రఘురాం పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో నిబంధనలకు విరుద్ధంగా కూటమి పార్టీల నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల నుంచి నాయకులు పెద్ద ఎత్తున చలో తుని కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఆర్ఎస్‌బి, ఉత్తరాఖండ్ జట్ల మధ్య పోటీ

ఉత్కంఠగా హాకీ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ 3వ రోజు సోమవారం ఉత్కంఠ భరిత వాతావరణంలో కొనసాగింది. కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్‌లోని ఆస్ట్రో టర్ఫ్ కోర్ట్‌లో మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో రాయల్ స్పోర్ట్స్ బోర్డ్ (ఆర్ఎస్‌బి) ఉత్తరాఖండ్ జట్ల మధ్య పోటీ తొలి నుంచి ఏకపక్షంగా సాగింది. ఈ మ్యాచ్‌లో ఆర్ఎస్‌బి జట్టు 6 గోల్స్ చేయగా ఉత్తరాఖండ్ జట్టు ఒక్క గోల్ కూడా సాధించలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ఆనంద రత్నకుమార్ మూడు గోల్స్ సాధించగా గోవింద్, గణేష్, సుమన్ ఒక్కో గోల్స్ చేసి జట్టును విజయపథంలో నడిపించారు.